సాక్షి నల్లగొండ

శనివారం । 21 । జూన్ । 2025

Our Village

'సోషల్' సర్వీస్!
సోషల్ మీడియాను ఉపయోగించి గుజ్జ గ్రామానికి చెందిన ఓ యువకుడు సామాజిక సేవ చేస్తున్నాడు. - 8లో



వరి విత్తనాలు సీజ్
గరిడేపల్లి, నేరేడుచర్ల మండలాల్లో అనుమతి లేకుండా విక్రయిస్తున్న వరి విత్తనాలను అధికారులు సీజ్ చేశారు. - 8లో



ఆదర్శం.. ఆ ఉపాధ్యాయులు
తాము చదువు చెబుతున్న ప్రభుత్వ స్కూళ్ల లో తమ పిల్లలను చేర్పించి ఆదర్శంగా నిలిచారు ఆ ఉపాధ్యాయులు. - 8లో

న్యూస్‌రీల్

కేతేపల్లి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

నల్లగొండ: విధుల్లో నిర్లక్ష్యం వహించిన కేతేపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటేశ్వర్లు కేతేపల్లిలోని ఇంటి నంబర్ 2- 97/1 కు సరైన పత్రాలు లేకుండానే నివాస ధ్రువీకరణ పత్రం జారీ చేసి, విధుల్లో నిర్లక్ష్యం వహించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సస్పెన్షన్ సమయంలో ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా కార్యస్థానాన్ని వదిలి వెళ్లకూడదని సూచించారు. ఖాళీగా ఉన్న పోస్టుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఎంపీడీఓను కలెక్టర్ ఆదేశించారు.

భూగర్భ శాస్త్రం.. అవకాశాల పెన్నిధి



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు భూగర్భశాస్త్రం అవకాశాల పెన్నిధి అని ఎంజీయూ వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం ఎంజీ యూనివర్సిటీలోని భూగర్భ శాస్త్ర పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన బ్రోచర్‌ను ఆయన విడుదల చేసి మాట్లాడారు. భూగర్భ శాస్త్రంలో రాణించిన విద్యార్థులకు జియాలజిస్ట్, హైడ్రోజియాలజిస్ట్, మైనింగ్ జియాలజిస్ట్, జియోసైంటిస్ట్ వంటి ఉద్యోగాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ అల్వాల రవి, వై.ప్రశాంతి, కె.ప్రేమ్ సాగర్, ఆంజనేయులు, మధుసూదన్‌రెడ్డి, మచ్చేందర్ పాల్గొన్నారు.

ప్రాజెక్ట్ పనుల్లో నాణ్యత పాటించాలి



కిష్టరాయిన్‌పల్లి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నాంపల్లి: కిష్టరాయిన్‌పల్లి రిజర్వాయర్ పనుల్లో నాణ్యత పాటించాలని నల్లగొండ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సంబంధిత అధికారులకు సూచించారు. నాంపల్లి మండలంలోని లక్ష్మణాపురం గ్రామంలో చేపట్టిన కిష్టరాయిన్‌పల్లి రిజర్వాయర్ పనులు, ప్రాజెక్ట్ పరిధిలోని ప్రభుత్వ భూమిని పరిశీలించారు. త్వరలోనే రైతులందరి భూములకు పరిహారం అందే విధంగా ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రాజెక్ట్‌లో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, పనులకు ఆటంకం కలిగించొద్దని చెప్పారు. ఆయన వెంట ఇరిగేషన్ ఎస్సీ, చందూర్ డివిజన్ ఇన్‌చార్జ్ ఆర్డీఓ రమణారెడ్డి, డీఈ జాన్‌నాయక్, తహసీల్దార్ దేవసింగ్, సిబ్బంది ఉన్నారు.

ఇబ్రహీంపేటలో ఎన్‌ఎస్పీ భూముల సర్వే



ఇబ్రహీంపేటలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు

హాలియా : మండలంలోని ఇబ్రహీంపేట గ్రామ పరిధిలో ఉన్న ఎన్‌ఎస్పీ భూములను రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు శుక్రవారం సర్వే చేశారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాల మేరకు హాలియా ఇన్‌చార్జ్ తహసీల్దార్ రఘు ఆధ్వర్యంలో మిర్యాలగూడ డివిజన్ సర్వేయర్ పోకల విజయ్‌తో పాటు మరో 9మంది సర్వేయర్లు కలిసి సర్వే చేపట్టారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 16, 17, 68, 72, 482, 484, 485, 486, 490, 491లలో ఉన్న సుమారు 105 ఎకరాల భూమిని సర్వే చేశారు. కాగా ఎన్‌ఎస్పీ భూములను సర్వే చేసే సమయంలో తమ భూముల సర్వే చేస్తున్నారని భావించిన సన్న, చిన్నకారు రైతులు సర్వేకు వచ్చిన అధికారులను అడ్డుకుంటుండగా పోలీసులు, అధికారులు వారికి సర్ది చెప్పారు. ఎన్‌ఎస్పీ భూముల సర్వే పోలీసుల పహారా మధ్య జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా హాలియా సీఐ సతీష్‌రెడ్డి నేతృత్వంలో పోలీస్ బలగాలు బందోబస్తు నిర్వహించాయి. కార్యక్రమంలో హాలియా సీఐ సతీష్‌రెడ్డి, ఆర్‌ఐ నవీన్‌కుమార్, సర్వేయర్లు సైదులు, రామనర్సు, స్వప్న, రాజా ప్రతాప్, శ్రీనివాస్, ముత్తయ్య, జైహింద్, విప్లవ జ్యోతి, పోలీసులు తదితరులు ఉన్నారు.

'ఈవీ'లకు నో పవర్!

చార్జింగ్ సౌకర్యం లేక రోడ్డెక్కని ఎలక్ట్రిక్ బస్సులు



నార్కట్‌పల్లి డిపోలో నిలిపిన ఎలక్ట్రిక్ బస్సులు

- ప్రత్యేక లైన్, సబ్‌స్టేషన్ ఏర్పాటులో అలసత్వం
- నల్లగొండ డిపోకు 15 రోజుల క్రితం వచ్చిన 40 ఎలక్ట్రిక్ బస్సులు
- వాటిని నార్కట్‌పల్లి డిపోలో ఉంచిన అధికారులు
- కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంతో డిపో దాటని బస్సులు



నల్లగొండ డిపోలో నిర్మాణంలో ఉన్న చార్జింగ్ స్టేషన్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో ఎలక్ట్రిక్ బస్సు (ఈవీ)లకు చార్జింగ్ కష్టాలు వచ్చిపడ్డాయి. ఎలక్ట్రిక్ బస్సులకు అవసరమైన చార్జింగ్ కోసం విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్ నిర్మాణంలో ఎడతెగని జాప్యం జరుగుతోంది. ఆ పనుల కోసం మూడు నెలల కిందటే టెండర్లు పిలిచినా కాంట్రాక్టు సంస్థ అలసత్వంతో ఈవీ బస్సులు రోడ్డెక్క లేదు. దీంతో నల్లగొండ డిపోకు కేటాయించిన 40 ఈవీ బస్‌లను నార్కట్‌పల్లి డిపోలో భద్రపరిచారు. సూర్యాపేట, నల్లగొండ డిపోలకు ఒకేసారి ఈవీ బస్‌లు వచ్చాయి. 11 కేవీ లైన్, సబ్‌స్టేషన్, ఛార్జింగ్ పాయింట్ల నిర్మాణ బాధ్యతలను రెండుచోట్ల ఒకేసారి కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. సూర్యాపేటలో ఇప్పటికే ఆ పనులన్నీ పూర్తయి బస్‌లు రోడ్డెక్కగా, నల్లగొండలో మాత్రం పనుల్లో జాప్యం జరుగుతోంది.

పనుల్లో ఎడతెగని జాప్యం

ఖర్చులను తగ్గించుకోవాలనే ఉద్దేశంతో ఆర్టీసీ ఈవీ బస్‌లను తీసుకొస్తోంది. అందులో భాగంగా నల్లగొండ, సూర్యాపేట డిపోలకు ఎలక్ట్రిక్ బస్‌లను మంజూరు చేసింది. అందుకోసం ఈ రెండు డిపోల్లో ప్రత్యేకంగా 133/11 కేవీ లైన్, సబ్‌స్టేషన్ నిర్మించాల్సి ఉంది. వాటితోపాటు జనరేటర్ల ఏర్పాటు, ఛార్జింగ్ పాయింట్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. సూర్యాపేట, నల్లగొండ జిల్లాలో ఒకే కాంట్రాక్టర్ కాంట్రాక్టు పొందినప్పటికీ సూర్యాపేటలో పనులను ఎప్పుడో పూర్తి చేశారు. ఈ నెల 9వ తేదీన ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సూర్యాపేటలో ఈవీ బస్సులను ప్రారంభించారు. నల్లగొండ డిపోలో మాత్రం ఛార్జింగ్ పాయింట్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నా, ప్రత్యేక లైన్, సబ్‌స్టేషన్ పనుల్లో వేగం పుంజుకోవడం లేదు.

నెలాఖరు వరకు రోడ్డెక్కేది అనుమానమే

ఎలక్ట్రిక్ బస్సులు జిల్లాకు చేరి 15 రోజులు కావస్తోంది. విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్ పనులేవీ చేపట్టలేదు. ఇప్పటికిప్పుడు పనులు ప్రారంభించి.. రాత్రింబవళ్లు పనిచేసినా ఈ నెలాఖరు వరకు కూడా అవి పూర్తికావు. బస్ డిపోలో ఇప్పటివరకు జనరేటర్లను ఏర్పాటు చేసి, ఛార్జింగ్ పాయింట్ల పనులను మాత్రమే చేపట్టారు. విద్యుత్ లైన్, సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తేనే వాటికి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంటుంది. అప్పటివరకు బస్సులు డిపోకు పరిమితం కావాల్సిందే.

తాత్కాలిక లైన్‌తో తలెత్తనున్న సమస్యలు

నల్లగొండలోని హైదరాబాద్ రోడ్డు సబ్‌స్టేషన్ నుంచి 133/11 కేవీ ప్రత్యేక లైన్‌ను డిపో వేయాల్సి ఉండగా.. ఆ విషయంలో కాంట్రాక్టు సంస్థ అలసత్వం ప్రదర్శిస్తోందని అధికారులే చెబుతున్నారు. అయితే బస్టాండ్ సమీపంలోని విద్యుత్ లైన్ నుంచి తాత్కాలికంగా డిపో వరకు లైన్ వేసేందుకు సిద్ధమయ్యారు. దానివల్ల మరిన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ప్రస్తుతం సుభాష్ విగ్రహం నుంచి వెళ్లే 133/11 కేవీ లైన్ పరిధిలో చాలా ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. ఆయా ట్రాన్స్‌ఫార్మర్లలో ఎక్కడ సమస్య వచ్చినా, సబ్‌స్టేషన్‌లో ఎల్‌సీ తీసుకుంటారు. ఆ సమయంలో ఆర్టీసీ ఛార్జింగ్ యూనిట్‌కు కూడా విద్యుత్ నిలిచిపోతుంది. దీంతో బస్‌లకు ఛార్జింగ్ విషయంలో అంతరాయం ఏర్పడుతుంది. జనరేటర్ ఉన్నా కొంత సమయం వరకే వస్తుంది. అందుకే మెయిన్ సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేక్ లైన్ కోసం ఆర్టీసీ.. విద్యుత్ శాఖకు డబ్బులను చెల్లించింది. కానీ కాంట్రాక్టు సంస్థ ఆ పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తోంది.

కాంట్రాక్ట్ సంస్థకు నోటీసులు ఇచ్చాం

నల్లగొండ డిపో వద్దకు విద్యుత్ లైన్ ఏర్పాటు, సబ్‌స్టేషన్ నిర్మాణ పనుల విషయంలో జాప్యం చేస్తుండటంతో కాంట్రాక్ట్ సంస్థకు నోటీసులు ఇచ్చాం. హైదరాబాద్ రోడ్డు నుంచి స్తంభాలు వేసి, లైన్ ఏర్పాటు చేయడానికి సమయం పడుతుందని కాంట్రాక్ట్ సంస్థ అంటోంది. ప్రస్తుతం తాత్కాలికంగా సుభాష్ విగ్రహం వద్ద నుంచి వెళ్తున్న 133/11 కేవీ లైన్ నుంచి నుంచి ఆర్టీసీ డిపోకు లైన్ వేసే పనులు ప్రారంభిస్తామని చెప్పింది. ప్రత్యేకంగా లైన్ కావాలని ఆర్టీసీ అధికారులు అడిగారని.. ఆ పనులను కూడా త్వరలో ప్రారంభించి, రెండు నెలల్లో పూర్తయ్యేలా చూస్తామని కాంట్రాక్ట్ సంస్థ చెప్పింది.

– వెంకటేశ్వర్లు, ట్రాన్స్‌కో ఎస్‌ఈ, నల్లగొండ

నార్కట్‌పల్లి డిపోకు పెరగని బస్సులు

నార్కట్‌పల్లి : నిజాం కాలంలో ఏర్పాటైన నార్కట్‌పల్లి బస్సు డిపో.. నేడు అవసాన దశలో ఉంది. రెండేళ్ల క్రితం వరకు ఈ డిపోలో 67 బస్సులు ఉన్నాయి. వీటిలో 2 సూపర్ లగ్జరీ, 11 ఎక్స్‌ప్రెస్, 54 పల్లె వెలుగు సర్వీసులు ఉన్నాయి. డిపోలో ఉన్న కొన్ని సర్వీస్‌ల వల్ల నష్టాలు వస్తున్నాయని ఆర్టీసీ అధికారులు డిపోలోని బస్సులను జిల్లాలోని ఇతర డిపోలకు పంపారు. సిబ్బందిని సర్దుబాటు చేశారు. డిపో తొలగిస్తారనే ప్రచారం కూడా సాగడంతో.. ఆ పార్టీల నేతలు ఆందోళనలు చేయడంతో బస్సులను పూర్తిగా తొలగించకుండా కేవలం 15 బస్సులతో కొనసాగిస్తున్నారు.

నల్లగొండ డిపో బస్సులు ఇక్కడికి వస్తాయని..

ఇటీవల నల్లగొండ డిపోకు దాదాపు 40 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించారు. అక్కడ స్థలం లేక వాటిని నార్కట్‌పల్లి డిపోలు ఉంచారు. నల్లగొండలో చార్జింగ్ పాయింట్ ప్రారంభిస్తే.. నల్లగొండ డిపోలో స్థలం సరిపోదు. నల్లగొండ డిపోలో డీజిల్‌తో కొనసాగే సర్వీలను నార్కట్‌పల్లి డిపోకు పంపుతారని దాంతో నార్కట్‌పల్లి డిపోకు పూర్వ వైభవం వస్తుందని ప్రజలు భావిస్తున్నారు.



బస్సులను పెంచేందుకు ఆదేశాలు రాలేదు

నార్కట్‌పల్లి డిపోలో బస్సుల సంఖ్య పెంచాలని పైఅధికారుల నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. కొత్త రూట్లు ఏర్పాటు చేస్తే బస్సులను పెంచే ఆలోచన ఉంటుంది. నల్లగొండ డిపోలో సర్వీస్ అయిపోయిన బస్సులను తొలగించి ఎలక్ట్రిక్ బస్సులను ఏర్పాటు చేస్తున్నాం. నల్లగొండ డిపోలో కరెంట్ పనులు పూర్తయ్యాక చార్జింగ్ బస్సులను ప్రారంభిస్తాం.

– శ్రీనాథ్, నార్కట్‌పల్లి ఇన్‌చార్జి డీఎం

ఇంటర్‌లోనే లక్ష్యాన్ని ఎంచుకోవాలి



నల్లగొండలోని బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ : బాలికలు ఇంటర్ స్థాయిలోనే మంచి లక్ష్యాన్ని ఎంచుకుని ఆ లక్ష్యసాధనకు కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. శుక్రవారం ఆమె నల్లగొండలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను సందర్శించి సందర్భంగా మాట్లాడారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ మీడియం ఎంపీసీ, బైపీసీ తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థినులతో ముఖాముఖి మాట్లాడారు. ఏ పాఠశాల నుంచి వచ్చారని? పదవ తరగతిలో ఎన్ని మార్కులు వచ్చాయని ? జీవితంలో మీ ఆశయాలు ఏంటి? అని కలెక్టర్ ప్రశ్నించారు. ఇంజనీరింగ్‌లో మంచి కోర్సులు సంపాదించేందుకు, భవిష్యత్‌లో మంచి కంపెనీల్లో ఉద్యోగాలు సాధించేందుకు అవసరమైన మెళకువలను బోర్డుపై రాసి వివరించారు. కళాశాలలో నూతన ప్రవేశాలు, విద్యార్థుల సంఖ్య, కళాశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రిన్సిపాల్ సుధారాణిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇంటర్మీడియట్ బైపీసీ ఇంగ్లిష్ మీడియం విద్యార్థినులకు డిక్షనరీలను అందజేశారు. కళాశాలలో ఖాళీ స్థలంలో విద్యార్థినులు చదువుకునేందుకు గాను షెడ్ నిర్మాణానికై స్థలాన్ని పరిశీలించారు.

పరిశ్రమల ఏర్పాటుకు సహకరిస్తాం

స్వయం సహాయక మహిళా సంఘాలు పరిశ్రమల యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వస్తే అవసరమైన సహకారం అందిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం ఆమె నల్లగొండలోని టీటీడీసీలో మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళా సంఘాల సభ్యులు ఇందిరా మహిళా శక్తి సంఘాలుగా ఏర్పాటై వివిధ రకాల యూనిట్ల తో పరిశ్రమల ను ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తే రుణాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి, ఏపీడీ శ్రవణ్‌కుమార్, అలీప్ సంస్థ సెక్రటరీ పద్మజ, కమిటీ సభ్యురాలు పద్మావతి, సీనియర్ ప్రోగ్రాం అధికారి లక్ష్మీప్రియ, ప్రోగ్రాం ఆఫీసర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

కార్యదర్శులు సివిల్ కేసుల్లో జోక్యం చేసుకోవద్దు

నల్లగొండ : న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న సివిల్ కేసుల్లో పంచాయతీ కార్యదర్శులు జోక్యం చేసుకోకూడదని కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎవరైనా పంచాయతీ కార్యదర్శులు ఇలాంటి చర్యలకు పాల్పడితే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివాదాస్పద ప్రాంతాల్లో, ఇళ్లలో ఇంటి నంబర్లు, ఆస్తి సంబంధిత సర్టిఫికెట్లు జారీ చేయడాన్ని నిలిపివేయాలని ఆదేశించారు. ఎంపీడీఓలు, ఎంపీఓలు ఈ సమస్యపై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కల్పించాలని సూచించారు.

శిశు మరణాలపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, చిత్రంలో డీఎంహెచ్‌ఓ, అధికారులు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: గ్రామీణ ప్రాంత మహిళల్లో శిశు మరణాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శిశు మరణాలపై శుక్రవారం నల్లగొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. సరైన పోషకాహారం తీసుకోకపోవడం, ప్రసవాలకు మధ్య దూరం ఎక్కువగా లేకపోవడంతో శిశు మరణాలు సంభవించే అవకాశాలు ఉన్నాయన్నారు. వెంట వెంటనే గర్భం దాల్చడం వల్ల పుట్టబోయే బిడ్డ సరైన విధంగా పుట్టకపోవడం, బరువు తక్కువగా ఉండడం, పుట్టిన తర్వాత మరణించేందుకు ఆస్కారాలు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించేలా, పౌష్టికాహారం తీసుకునే విధంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్, డాక్టర్ మాతృనాయక్, కృష్ణవేణి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

'బెస్ట్ అవైలబుల్'కు విద్యార్థుల ఎంపిక



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్



డ్రా తీస్తున్న పీడీ రాజ్‌కుమార్

నల్లగొండ: బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఈ విద్యా సంవత్సరం ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసించేందుకు గిరిజన విద్యార్థుల ప్రవేశాలకు డ్రా పద్ధతిన ఎంపిక చేశారు. శుక్రవారం పానగల్ రోడ్డులోని గిరిజన వసతి గృహంలో డ్రా నిర్వహించారు. జిల్లాలోని ఆరు ప్రైవేట్ పాఠశాలల్లో 34 మంది బాలబాలికలకు లాటరీ ద్వారా సీట్లు కేటాయించారు. మొత్తం 184 దరఖాస్తులు రాగా 34 సీట్లు మాత్రమే కేటాయించడంతో సీట్లు ఎందుకు తగ్గించారంటూ పిల్లల తల్లిదండ్రులు అధికారులను ప్రశ్నించారు. గతంలో వంద సీట్లు ఉండగా ప్రస్తుతం కోత విధించారని అదనపు కలెక్టర్ నారాయణ్ అమిత్ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రునాయక్, ఏఓ పార్థసారథి, ఏటీడీఓ శ్రీనివాస్, రామకృష్ణ, ప్రవీణ్‌నాయక్, సక్రునాయక్ పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల విద్యార్థులు..

నల్లగొండ: 2025- 26 సంవత్సరానికి సంబంధించి షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 1, 5 తరగతుల్లో ప్రవేశానికి శుక్రవారం నల్లగొండ ఉదయాదిత్య భవన్‌లో డ్రా పద్ధతిన ఎంపిక చేశారు. గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్ లక్కీ డ్రా తీశారు. 1వ తరగతిలో ప్రవేశానికి 134 మంది విద్యార్థులు, 5వ తరగతిలో ప్రవేశానికి 137 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డీడీ శశికళ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.



యోగాకి వేళాయే..

శనివారం యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాలు వేసేందుకు సిద్ధం చేసిన నల్లగొండలోని బీజేపీ కార్యాలయం

భూ సమస్యలపై 42,534 దరఖాస్తులు

- మిస్సింగ్ సర్వే నంబర్లపైనే అధికంగా..
- ముగిసిన రెవెన్యూ సదస్సులు

నల్లగొండ : రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యలు పరిష్కరించేందుకు తీసుకొచ్చిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు శుక్రవారంతో ముగిసాయి. వివిధ భూ సమస్యలపై జిల్లా వ్యాప్తంగా 42,534 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎక్కువగా మిస్సింగ్ సర్వే నంబర్లపై 14803 దరఖాస్తులు వచ్చాయి. గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం చేపట్టిన రెవెన్యూ సదస్సులు ఈ నెల 3న ప్రారంభించారు. సదస్సుల నిర్వహణకు ప్రతి మండలంలో రెండు బృందాలనే ఏర్పాటు చేశారు. ఒక బృందానికి తహసీల్దార్, మరో బృందానికి డిప్యూటీ తహసీల్దార్ బాధ్యులుగా వ్యవహరించారు. రోజుకు రెండు గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో భూ సమస్యలపై ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. తమకున్న రకరకాల భూ సమస్యలపై ప్రజలు పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. సదస్సుల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. సదస్సులను ఎప్పటికప్పుడు కలెక్టర్ ఇలా త్రిపాఠి, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్‌ఓ, ఆర్డీఓలు పర్యవేక్షించారు.



నిడమనూరు రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణయ్య

రెవెన్యూ సదస్సులు, దరఖాస్తుల వివరాలు ఇలా..

జిల్లాలో మండలాలు	33
రెవెన్యూ గ్రామాలు	550
వచ్చిన దరఖాస్తులు	42,534
మిస్సింగ్ సర్వే నెంబర్లపై	14,803
పెండింగ్ మ్యూటేషన్లు, కోర్టు ఆర్డర్లు అమలు చేయాలని	802
డిజిటల్ సంతకం పెండింగ్‌పై	795
పేరు, విస్తీర్ణం తప్పులపై	2,998
నిషేధిత జాబితాపై	808
అసైన్డ్ భూములపై	6,539
ఫౌతిపై	1,400
భూ సేకరణపై	56
ఇతర సమస్యలపై	14,333

జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా మాధవి

నల్లగొండ: నీలగిరి జిల్లా సమాఖ్య ఎన్నికలు శుక్రవారం స్థానిక సమాఖ్య కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పదాధికారులను ఎన్నుకున్నారు. 29 మండలాలకు చెందిన సమాఖ్య అధ్యక్షులు ఓటింగ్ ప్రక్రియ ద్వారా ఎన్నుకున్నారు. జిల్లా సమాఖ్య అధ్యక్షురాలిగా చిట్యాల సమాఖ్య అధ్యక్షురాలు ఆవుల మాధవి, కార్యదర్శిగా మునుగోటి సరిత, కోశాధికారిగా ఎల్లంపల్లి సునీతను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా మాజీ డీసీఓ వెంకటేశ్వర్లు వ్యవహరించారు. ఎన్నికల్లో రాష్ట్ర పరిశీలకులుగా ప్రాజెక్టు మేనేజర్ సెర్ప్ భారతి, పరిశీలకులుగా అదనపు డీఆర్‌డీఓ నవీన్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వాజిద్, అడిషనల్ డీఆర్‌డీఓ శ్రవణ్, కోఆర్డినేటర్ డీఎస్. బెనర్జీ వ్యవహరించారు.

పేదలకు అండ.. ఎర్రజెండా

మిర్యాలగూడ : పేదలకు ఎల్లప్పుడూ ఎర్రజెండా అండగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. శుక్రవారం దామరచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఐ మండల 9వ మహాసభలో ఆయన మాట్లాడారు. సీపీఐ ఏర్పడిన వంద సంవత్సరాల కాలంలో పేదల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాడిందన్నారు. సీపీఐ చేసిన త్యాగాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను సమీకరించి పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తుందని మండిపడ్డారు. స్థానిక ఫ్యాక్టరీల్లో స్థానికులకే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, యాదాద్రి పవర్ ప్లాంట్‌లో భూములు కోల్పోయిన రైతులందరికీ పరిహారం అందించడంతోపాటు ప్లాంట్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.సయ్యద్, మండల అధ్యక్షుడు ధీరావత్ లింగానాయక్, అంజనపెల్లి రామలింగం, జిల్లా యాదగిరి, నాయకులు జమ్మల కోటయ్య, శాంతి, పోలేపల్లి ఉదయ్, బుజ్జి లింగానాయక్, పోలేపల్లి మమత, లక్ష్మయ్య, రవి, అన్నపూర్ణ, నిర్మల, వెంకటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

22న ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ జట్టు ఎంపిక

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలుర జూనియర్ ఫుట్‌బాల్ జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు ఉమ్మడి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ చైర్మన్ గంట్ల అనంతరెడ్డి, అధ్యక్షుడు బండారు ప్రసాద్, ప్రధాన కార్యదర్శి బొమ్మపాల గిరిబాబులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1-1-2009 నుంచి 31-12-2011 మధ్య జన్మించిన యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్లగొండ జిల్లా వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఉదయం 9 గంటలకు నల్లగొండలోని మేకల అభినవ్ అవుట్‌డోర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని తెలిపారు. క్రీడాకారులు వారి ఆధార్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, రెండు ఫొటోలు, ఫుట్‌బాల్ కిట్ తో హాజరు కావాలని కోరారు. నల్లగొండలో ఎంపికైన జిల్లా జట్టు ఈనెల 28 నుంచి జూలై1వ తేదీ వరకు నిజామాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు.

మట్టపల్లిలో విశేష పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి : మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం విశేష పూజలు కొనసాగాయి. శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు విశేషంగా నిర్వహించారు. తర్వాత ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం శ్రీస్వామి అమ్మవార్ల పల్లకీ సేవను కృష్ణానది వద్ద ప్రహ్లాద ఘాట్‌కు తరలించి హారతి పూజలు నిర్వహించారు.

సోషల్ సర్వీస్!

- సోషల్ మీడియా ద్వారా గ్రామస్తుల బాగోగులు
- 'మన ఊరు–మన గుజ్జ' పేరుతో పేజీల నిర్వహణ
- పుష్కరకాలంగా కృషిచేస్తున్న యువకుడు శశికాంత్

ఫేస్‌బుక్... యూట్యూబ్... ఇన్‌స్టాగ్రామ్... వాట్సాప్... ఇలా సోషల్‌మీడియాను యువత సరదా కోసమో, వినోదం కోసమో వినియోగిస్తారనే భావన అనేక మందిలో ఉంటోంది. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండలం గుజ్జ గ్రామానికి చెందిన శ్రీరామోజు శశికాంత్ మాత్రం వీటి వినియోగంతో సామాజిక సేవ చేస్తున్నారు. డిగ్రీ చేసిన ఈయన 'మన ఊరు–మన గుజ' పేరుతో ఆయా వేదికల్లో పేజీలు నిర్వహిస్తూ గ్రామానికి, గ్రామస్తులకు సేవ చేస్తున్నారు. 12 ఏళ్లుగా అప్రతిహతంగా తన కృషిని కొనసాగిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. ఆలోచన మాత్రమే తనదని, ఆచరణలో మాత్రం గ్రామం మొత్తం పాలుపంచుకుంటోందని శశికాంత్ చెబుతున్నారు – సాక్షి ప్రతినిధి, నల్లగొండ



స్వచ్ఛంద సంస్థల సహకారంతో గ్రామ మహిళలకు స్వయం అభివృద్ధి, కుటీర పరిశ్రమల ఏర్పాటుపై నిర్వహించిన సమావేశం (ఫైల్)



'మన ఊరు.. మన గుజ్జ' పేరుతో రూపొందించిన సింబల్

గుజ్జ నుంచి దేశ విదేశాలకు వెళ్లి స్థిరపడిన వారు అనేక మంది ఉన్నారు. వారితో పాటు ప్రపంచంలో ఉన్న తెలుగు వారందరికీ ఎప్పటికప్పుడు ఊరి విశేషాలను చేరవేయడం.. అవసరమైతే వాళ్లూ ఓ చేయి వేసి చేయూత అందించేలా చేయడం ఈ 'సోషల్ మీడియాల' గొప్పదనం. గుజ్జ యువతలో సేవాదృక్పథాన్ని నింపేలా 2013 నుంచి ఈ 'సామాజిక ఉద్యమం' కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గుజ్జ గ్రామస్తులకు ఊరిలో ఏం జరుగుతోంది? ఏయే పండుగలు ఎలా జరుగుతున్నాయి? తదితర వివరాలను ఎప్పటికప్పుడు ఈ పేజీలు అందిస్తున్నాయి.

ఎందరో ఆపన్నులకు ఆసరాగా నిలిచి...

'మన ఊరు – మన గుజ్జ వేదికను శశికాంత్ ఆ గ్రామంలో ఉన్న, గ్రామం నుంచి వెళ్లి వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన గ్రామస్తుల సహకారంతో ముందుకు నడిపిస్తున్నారు. హఠాన్మరణం పొందిన వారి కుటుంబాలకు, అనారోగ్యానికి గురైన వారికి, ఆసుపత్రిల్లో వైద్యం అవసరమైన వారికి ఆర్థిక సహాయం, తోడ్పాటు అందేందుకు ఈ ×మన ఊరు–మన గుజ్జ' పేజీలు పనిచేస్తున్నాయి. రోడ్డు ప్రమాదంలో మరణించిన గంగదేవి తిరుమలేష్ భార్య, నలుగురు పిల్లలకు, రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ నల్లగంటి చందుకు, మెదడులో రక్తం గడ్డకట్టడంతో ఆస్పత్రిలో చేరిన మంగ లింగమ్మకు వైద్యం కోసం, క్రికెట్‌లో ప్రతిభ కనబరుస్తున్న గోప రాజు సాయి అర్జున్‌కు అవసరమైన డబ్బు సమకూర్చడంలోనూ ఈ పేజీలు కీలకపాత్ర పోషించాయి. వీరితో పాటు గ్రామంలో ఉన్న వృద్ధులు, విద్యార్థుల కోసమూ అనేక సహాయ కార్యక్రమాలు వీటి ద్వారా జరుగుతున్నాయి.

సంప్రదాయ, సంస్కృతులు చాటిచెప్పేలా..

శశికాంత్ గుజ్జ గ్రామస్తులతో కలిసి ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ద్వారా సంప్రదాయ, సంస్కృతులు అందరికీ చాటిచెప్పడానికీ కృషిచేస్తున్నారు. వాటికి అద్దం పట్టేలా బతుకమ్మ పాటల పోటీల నిర్వహణ, గ్రామ చరిత్ర, గొప్పదనం వివరిస్తూ.. రెండు బతకమ్మ పాటలు రాసి, పాడించి చిత్రీకరణ చేయించారు. జాతీయ నాయకుల జయంతులు, వర్ధంతులు క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, వారి త్యాగాలు ఈ తరం యువతకు తెలిసేలా చేస్తూ వారిలో చైతన్యం నింపుతున్నారు. సేవ చేయాలన్న తపన, ఊరి కోసం పని చేయాలన్న సంకల్పం వారిలో పెరిగేందుకు కృషిచేస్తున్నారు.

గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహణ

ఈ సోషల్ మీడియా వేదిక ద్వారా పలువురిని ఆకర్షిస్తున్న శశికాంత్ వారితో గ్రామంలో అవగాహన సదస్సులు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గ్రామీణ మహిళల స్వయం ఉపాధి, స్వయం సమృద్ధి కోసం అవసరమైన ప్రాథమిక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత నెలలో గుజ్జ రైతు వేదిక వద్ద స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు తోట రాము సహకారంతో వృత్తి నైపుణ్యాల పెంపుదల, వివిధ పథకాల కింద రుణాలు పొందే అవకాశం, కుటీర పరిశ్రమల ఏర్పాటు, మార్కెటింగ్ సాయం పొందే విధానాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వివిధ వర్గాల్లో ఉన్నతంగా ఉన్న వారి సహాయ, సహకారంతో శిక్షణ, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కృషి చేస్తున్నారు.

గ్రామస్తుల సహకారంతోనే సేవ



గ్రామస్తుల సహకారంతోనే 'మన ఊరు– మన గుజ్జ' సోషల్ మీడియాను ప్రారంభించాను. గ్రామస్తులు ఒక్కొక్కరుగా చేరడంతో సోషల్ మీడియాలో గ్రామస్తులమంతా టీంగా ఏర్పడ్డాం. సహాయ, సహకారాల్లో గ్రామం మొత్తం భాగస్వామ్యమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ప్రతి గ్రామ పంచాయతీకి సోషల్ మీడియా గ్రూపులను ఏర్పాటు చేయాలన్నది నా ఆకాంక్ష. అవకాశం ఉన్న వారు ముందుకు వచ్చి సహాయ సహకారాలు అందిస్తే ఇంకా మెరుగైన సేవలు అందిస్తాం.

– శ్రీరామోజు శశికాంత్

స్వర్ణగిరి క్షేత్రంలో కుంకుమార్చన



కుంకుమార్చన నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు

భువనగిరి: భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలోని శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో శుక్రవారం అష్టోత్తర శత నామాలతో విశేష కుంకుమార్చన సేవ కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో ఉదయం స్వామి వారికి సుప్రభాతసేవ, తోమాల సేవ, సహస్రనామార్చన, సేవ, నిత్య కల్యాణమహోత్సవం జరిపించారు. మధ్యాహ్నం సుమారు 3వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం తిరువీధి ఉత్సవ సేవ, కర్పూర మంగళహారతులు సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా విక్రయిస్తున్న వరి విత్తనాలు సీజ్



దిర్శించర్లలో పట్టుబడిన వరి విత్తనాలపై విచారణ చేస్తున్న పోలీసులు

గరిడేపల్లి: మండల పరిధిలోని చవ్వారిగూడెం గ్రామంలో అనుమతి లేకుండా విక్రయిస్తున్న వరి విత్తనాలను అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. మిర్యాలగూడ శివారులోని తుమ్మడం గ్రామానికి చెందిన కొంత మంది చవ్వారిగూడెం గ్రామం నుంచి అనుమతులు లేని విత్తన బస్తాలను ఆటోలో తీసుకెళ్తుండగా నేరేడుచర్ల పట్టణ శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఆరా తీయగా అనుమతులు లేకుండా విత్తనాలు అమ్ముతున్నట్లు గుర్తించారు. ఈమేరకు గరిడేపల్లి మండలం వ్యవసాయ అధికారి ప్రీతమ్‌కుమార్, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు ఆధ్వర్యంలో చెవ్వారిగూడెం గ్రామానికి వెళ్లి తిప్పన రాంరెడ్డికి చెందిన గోదాంలో తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా ఉన్న 150బస్తాల వరి విత్తనాలను సీజ్ చేశారు. కార్యక్రమంలో నేరేడుచర్ల ఎస్‌ఐ రవీందర్ నాయక్, గరిడేపల్లి ఏఎస్‌ఐ జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

Mrs. Shriram Finance Ltd. ... Ack Due ... [illegible]

రాయపూడి శ్రీనివాసరావు, అడ్వకేట్ & నోటరీ, సెల్: 98494 13930

తేది: 20-06-2025

ఆదర్శం.. ఆ ఉపాధ్యాయులు

- తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించిన ఉపాధ్యాయులు

అడ్డగూడూరు: ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తమ పిల్లలను తాము చదువు చెబుతున్న పాఠశాలల్లోనే చేర్పించి ఆదర్శంగా నిలిచారు. అడ్డగూడూరు మండల పరిధిలోని అజింపేట ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు నరేష్‌కు కుమార్తె రిషక, కుమారుడు రిషిదేవ్ ఉన్నారు. శుక్రవారం కుమార్తె రిషికను అదే పాఠశాలలోని 3వ తరగతిలో, కుమారుడు రిష్‌దేవ్ 2తరగతిలో చేర్పించారు. గతంలో వీరు తిరుమలగిరి మండలంలోని ప్రైవేట్ పాఠశాలలో చదివేవారని, విద్యార్థులకు సంపూర్ణ మనో వికాసానికి దోహదపడే బోధన ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతుందని, అందుకే ప్రభుత్వ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు.



అజీంపేట పాఠశాలలో తన కుమార్తె, కుమారుడితో ప్రభుత్వ ఉపాధ్యాయుడు నరేష్

ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేలా..

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని మక్తా కొత్తగూడెం గ్రామానికి చెందిన మట్టపల్లి సైదులు ఏపూర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన తన కుమారులైన గణ సాత్విక్, మంజిత్‌లను తాను పనిచేస్తున్న పాఠశాలలోనే శుక్రవారం చేర్పించారు. అనంతరం వారికి ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలు నోట్ బుక్స్, స్కూల్ యూనిఫాం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగించేందుకే తన ఇద్దరి కుమారులను ఈ పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు.



విద్యార్థులకు పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

అనుమానాస్పదంగా మహిళల సంచారం

- పట్టుకుని పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు

మోత్కూరు : అనుమానాస్పదంగా సంచరిస్తున్న మహిళలను గ్రామస్తులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన మండలంలోని ముశిపట్ల గ్రామంలో వెలుగులోకి వచ్చింది. గురువారం గ్రామంలో దొంగతనానికి రెక్కి నిర్వహిస్తున్న నలుగురు మహిళలను గ్రామస్తులు గుర్తించి పట్టుకొని ఆరా తీశారు. మధ్యాహ్న సమయంలో గ్రామంలో సంచరిస్తుండగా అనుమానం వచ్చిన పలువురు గ్రామస్తులు వారిని ప్రశ్నించి నిలదీశారు. వారు సరైన సమాధానం చెప్పకపోవడంతో అనుమానం బలపడింది. ఈ క్రమంలో వారు తప్పించుకునే ప్రయత్నం చేయగా గ్రామపంచాయతీ వద్దకు తీసుకెళ్లి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు నలుగురు మహిళలను విచారించారు. వరంగల్ జిల్లాకు చెందిన వాసులుగా గుర్తించారు. వరంగల్‌లోని రెడ్డినగర్, హన్మకొండ, కాజీపేట, మడికొండలకు చెందిన తుర్పతి మైసమ్మ, స్వాతి, శారద, సునీతగా పోలీసులు గుర్తించారు. వారిపై ఇప్పటికే నాలుగు దొంగతనం కేసులు నమోదైనట్లు ప్రొబెషనరీ ఎస్‌ఐ నోయల్ రాజు తెలిపారు. వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులకు అప్పగించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

పుస్తెలతాడు చోరీ

నార్కట్‌పల్లి : మహిళ మెడలోని పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. ఈ సంఘటన నార్కట్‌పల్లి మండలం మాధవ ఎడవల్లి సమీపంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోతనేనిపల్లికి కమ్మంపల్లి స్వామి, అతడి భార్య అండాలు టీవీఎస్ ఎక్సెల్‌పై నార్కట్‌పల్లికి వస్తుండగా వెనక నుంచి బైక్‌పై గుర్తు తెలియని వ్యక్తి వచ్చి అండాలు మెడలోని పుస్తెలతాడును లాక్కెళ్లాడు. పుస్తెలతాడు రోల్డ్‌గోల్డ్ అయినా, దానికి పావుతులం బంగారం పుస్తె, పావుతులం బంగారు గుండ్లు ఉన్నట్లు బాధితురాలు తెలిపింది. స్వామి పోలీసులకు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమార్తె

మోత్కూరు : పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని దాచారం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు అండెం కరుణాకర్‌రెడ్డి గురువారం తన పొలంలో పనులు చేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. గమనించిన స్థానికులు అతడిని హుటాహుటిన హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య బాలమణి, ఓ కుమార్తె ఉన్నారు. శుక్రవారం గ్రామంలో జరిగిన అంత్యక్రియలో కుమార్తె శృతి తండ్రి మృతదేహానికి తలకొరివి పెట్టింది.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి బలవన్మరణం



కిరణ్ మృతదేహం

బీబీనగర్ : ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని జైనపల్లి గ్రామశివారులో శుక్రవారం చోటు చేసుకుంది. సీఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జనగాం జిల్లా రఘునాథ్‌పల్లి మండలం మండేలగూడెం గ్రామానికి చెందిన ద్యాగాల కిరణ్(26) హైదరాబాద్‌లోని ఆమెజాన్ ఆన్‌లైన్ కొరియర్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. కిరణ్ 3సంవత్సరాల క్రితం ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు. ఈ క్రమంలో అతడికి ఖర్చులు బాగా పెరిగి ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో అమ్మాయి అతడి నుంచి దూరమైంది. దీంతో కిరణ్ జీవితంపై విరక్తి చెంది శుక్రవారం తెల్లవారుజామున బీబీనగర్ సమీపంలోని జైనపల్లి గ్రామపరిధిలోకి చేరుకొని చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో గ్రామస్తులు గమనించి పోలీస్‌లకు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి తల్లిదండ్రులకు సమాచారం అందించి మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భార్య సంపాదనపై ఆధారపడుతున్నానని మనస్తాపం

- ఉరేసుకుని ఆత్మహత్య

సంస్థాన్ నారాయణపురం: చేసిన అప్పులు తీర్చలేకపోవడంతోపాటు, భార్య సంపాదనపై ఆధారపడుతున్నానని మనస్తాపనకు గురైన వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం సర్వేల్ గ్రామంలో చేసుకుంది. ఎస్‌ఐ జగన్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ కు చెందిన మహ్మద్ సిద్దిక్(26) అఫీజాబేగంలు రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నారు. సిద్దిక్ కారు కొనుగోలు చేసి నడిపించేవాడు. తిరిగి దానిని అమ్మివేసి, క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సంవత్సరం క్రితం అఫిజాబేగంకు సర్వే ల్ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయురాలి ఉద్యోగం రావడంతో వీరు సర్వేల్‌కు వచ్చి అద్దె ఇంట్లో ఉంటున్నారు. అప్పులు ఎక్కువ కావడంతోపాటు, భార్య సంపాదనపై ఆధారపడుతున్నానని సిద్దిక్ మనస్తాపానికి గురయ్యా డు. భార్య శుక్రవారం పాఠశాలకు వెళ్లగా, ఇంట్లో ఒంటరిగా ఉన్న సిద్దిక్ ఉరివేసుకున్నాడు. ఆమె పాఠశాల నుంచి ఇంటికి వచ్చి చూసేసరికి విగతజీవిగా వేలాతున్నాడు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్

భువనగిరి : బస్సులో ప్రయాణికుడు మరిచిపోయిన సెల్ ఫోన్‌ను అప్పగించి ఆర్టీసీ కండక్టర్ నిజాయితీ చాటుకున్నాడు. వివరాల ప్రకారం.. భువనగిరి పట్టణానికి చెందిన యానూష్ శుక్రవారం నల్లగొండకు వెళ్లేందుకు భువనగిరి బస్టాండ్‌కు వచ్చి నల్లగొండ డిపోకు చెందిన సెమీ డీలక్స్ బస్సు ఎక్కాడు. యానూష్ తన సెల్ ఫోన్‌ను బస్సులో మర్చిపోయి నల్లగొండ బస్టాండ్‌లో దిగి వెళ్లిపోయాడు. బస్సులో సెల్‌ఫోన్‌ను గుర్తించిన కండక్టర్ సీఎస్ రెడ్డి భువనగిరి బస్టాండ్‌కు వచ్చిన తరువాత విషయాన్ని స్థానిక కంట్రోల్‌కు వివరించారు. ఫోన్ మరిచి వెళ్లిపోయిన బంధువుకు సామాజిక కార్యకర్త కదారి వెంకటేశం సమక్షంలో ఫోన్‌ను అప్పగించారు. బస్సులో మరిచిపోయిన సెల్‌ఫోన్‌ను అప్పగించిన కండక్టర్‌ను పలువురు అభినందించారు.